# తల్లిహృదయం



*ప్రతి ప్రస్థాన కలశ*
*ముఖ నిహితః ప్రథమ మంజరీ సహితః*
*నవ చూత పల్లవోయం*
*హర్తాగమనం ప్రియస్య మారోదీః*

***భావం:*** చిగుళ్ళతో ఉన్న కొత్త మామిడి పూగుత్తిని ప్రస్థాన కలశ ముఖంలో (ప్రయాణమయే వారికి గుమ్మంలో ఉంచే కలశం) ఉంచాను. ఆ కలశమే నీ ప్రియ భర్త ప్రయాణాన్ని ఆపుతుంది. దుఃఖించకు.

చంద్ర మోహనుడు రాజాస్థానంలో విద్యాధికారి, మంచి పండితుడు, కవి, మీదుమిక్కిలి ధనవంతుడు, అందగాడు, అతని భార్య చంద్రిక భర్తే ప్రాణంగా జీవించేది.

చంద్రమోహనుడికి ఆస్థానంలో ఎంతో గౌరవముండేది. చైత్ర మాసంలో అతను స్వయంగా వసంతోత్సవాలు నిర్వహించేవాడు. కవి పండితులని సత్కరించేవాడు. మాధవీ లతకూ, మామిడి చెట్టుకీ కల్యాణం చేయించేవాడు. ఆ వేడుక చూడడానికి నగరంలో జనమంతా వచ్చేవారు. ఆ సమయంలో రంగు నీళ్ళతో జలకాలాట అందరికీ ఆనందానిచ్చేది. చంద్రిక అయితే సంవత్సరమంతా ఎదురుచూసేది.

ఒక ఏడాది వైశాఖ మాసంలో చక్రవర్తి తమ కుమారుడి యువరాజాభిషేకం చేసి పండితులని సత్కరిస్తారనీ, దేశంలోని కవి పండితులందరూ రావచ్చుననీ చంద్రమోహనుడు నివసించే దేశపు రాజుకి వార్త వచ్చింది. చంద్రమోహనుడు ప్రయాణం కట్టాడు. చంద్రిక దిగులుపడి పోయింది. వివాహమయ్యేక ఆమె ఏనాడూ భర్తను వదిలి ఉండలేదు.

"వెళ్ళక తప్పదా" అని భర్తను అడిగిందామె.

"ఎంతకాలం రెండు నెలలేగా, నీ భర్తకు కీర్తీ, ధనమూ వస్తే నీకు గొప్పకాదా?" చంద్రికకు కోపమొచ్చింది. రెండు నెలలంటే రెండు క్షణాల్లా మాట్లాడుతున్నాడీయన.

"మిమ్మల్ని వదలి ఉండలేను."

"మీ మామగారు ఊళ్ళో లేనప్పుడు మీ అత్తగారు ఆరు నెలలుంది తెలుసా" చంద్రిక కోపం నసాళానికంటింది. ఆయన తల్లి ఉండి ఉండవచ్చును. భర్తమీద కన్నా ఆవిడకు నగలూ, చీరల మీదే ప్రేమ ఉండవచ్చు. తనకు భర్త సన్నిధి మాత్రమే పెన్నిధి కదా.

ఆమె కోపంతో మాట్లాడలేదు. మౌనం అంగీకారమనుకున్నాడో, మనస్సు మార్చుకోదల్చుకోలేదో చంద్రమోహనుడు ఆమెను పుట్టింట్లో దింపి చక్రవర్తి నగరానికి ప్రయాణమవాలని నిశ్చయించాడు. చంద్రికతో కలిసి అత్తవారింటికి వచ్చాడు. మర్నాడు ఉదయమే అతని ప్రయాణం.

ఆ రాత్రంతా చంద్రిక నిద్రపోలేదు. భర్తను వదిలి ఉండలేనన్న బెంగ ఆమెను పడుకోనివ్వలేదు.

తల్లీ కూతుళ్ళ అనుబంధం గాఢమైనది. తెల్లవారగానే ఎర్రబడ్డ కళ్ళతో ఉన్న కూతురిని చూడగానే చంద్రిక తల్లికి పరిస్థితి అర్థమైంది. అల్లుడి ప్రయాణం ఎలా ఆపాలా అని ఆలోచించింది. ప్రయాణం చేసే వారికి శకునంగా గుమ్మంలో కలశమూ, మంగళ ద్రవ్యాలూ ఉంచడం ఆనవాయితీ. చంద్రిక తల్లి కలశం పైభాగంలో చిగుళ్ళూ, కొత్తగా పూసిన పూలూ ఉన్న మామిడి గుత్తిని ఉంచి గుమ్మంలో పెట్టింది. కూతురితో "దుఃఖించకు" అంది.

చంద్రమోహనుడు ప్రయాణమవుతూ గుమ్మంలో ఉన్న కలశాన్ని చూశాడు.మామిడి చిగురు వేసిందంటే వసంత కాలం వచ్చిందన్నమాట. తను జరిపే వసంతోత్సవాలు జ్ఞాపకమొచ్చాయి. మల్లెల వేళలో మనసైన సతి సాంగత్యంకన్నా కీర్తీ, ధనం ఎక్కువ కాదనుకున్నాడు.

చాతుర్యంతో భర్త ప్రయాణాన్ని ఆపిన తల్లి ఒడిలో తలపెట్టుకుని పసిపాపలా నవ్వింది చంద్రిక. ప్రమోషన్లకై, ఉద్యోగంలో ముందుండడానికై, డబ్బు మిగుల్చు కోడానికై దూర ప్రాంతాలకు కుటుంబాన్ని వదిలి వెళ్ళే వారందరూ ఒక్కసారి ఆలోచించాలేమో కదా.

******